ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

- వైద్య సిబ్బంది చిత్తశుద్ధి పాటించాలి
- ఎమ్మెల్యే తిప్పేస్వామి




మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని, వైద్య సిబ్బంది విధి నిర్వహణలో చిత్తశుద్ధి పాటించాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి కోరారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు,ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో పేదలకు వైద్య సేవలందించడానికి ప్రభుత్వం అర్బన్ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేసిందన్నారు. ఈ సెంటర్‌కు భవనాలు కూడా నిర్మిస్తున్నామన్నారు. త్వరలోనే భవనాలను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. ప్రజా ఆరోగ్యమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమన్నారు. పేద ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు విజయవంతం కావాలంటే కిందిస్థాయిలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు కష్టపడి పని చేయాలన్నారు. ప్రభుత్వం అందించే వైద్య సేవలను క్షేత్రస్థాయిలో ప్రజలకు సక్రమంగా అందించాలని కోరారు. సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విధులకు సక్రమంగా హాజరుకావాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ప్రభుత్వ పరంగా తన వంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ విక్రమ్, కౌన్సిలర్ అంజన్ కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంజనేయ స్వామి ఉత్సవాలు ప్రారంభం



అలంకరణలో ఆంజనేయస్వామి

మడకశిరరూరల్: మండలంలోని చందకచర్లలో ఆంజనేయస్వామి ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. పురోహితులు వేదాపారాయణం, మృత్సంగ్రహణం, అంకురాపణాంగ, నవగ్రహ, సుదర్శన హోమాలు, కుంభారాధన కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణోత్సవం చేపట్టారు. అంతకుముందు స్వామిని ప్రత్యేకంగా పూలతో అలకంరించి పూజలు చేపట్టారు. ఆదివారం హనుమాన్ జయంతి సందర్భంగా స్వామికి జ్యోతులు, మధ్యాహ్నం బ్రహ్మరథోత్సవం కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

15న వాహనాల వేలం

పెనుకొండ: పలు ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన బైక్‌లు, కారు, ఆటోను ఈ నెల 15 ఉదయం 10 గంటలకు స్థానిక సెబ్ కార్యాలయంలో వేలం వేయనున్నట్లు సెబ్ సీఐ సుబ్బారెడ్డి శనివారం తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



రవిశంకర్ గురూజీ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం: స్థానిక ఎస్‌డీజీఎస్ కళాశాల ఆవరణలో శనివారం ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ వ్యవస్థపకుడు, యోగా గురువు రవిశంకర్ గురూజీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచి పెట్టారు. అనంతరం గురూజీ శిష్యులు, యోగా బృందం సభ్యులు సురేష్, శ్రీనివాసరెడ్డి, వెంకటస్వామి, శ్రీనివాస్ మాట్లాడారు. ప్రపంచం వసుధైక కుటుంబమని, ప్రజలందరూ ప్రశాంతగా జీవించాలన్నాదే గురూజీ అభిమతమన్నారు. సేవా కార్యక్రమాలతో ప్రజలకు సహాయపడాలని కోరారు. అనంతరం సామూహిక యోగా, ధాన్యం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేంద్ర, ఎస్‌డీజీఎస్ కళాశాల కార్యదర్శి బైసాని రాంప్రసాద్, ప్రిన్సిపాల్ నాగేంద్రకుమార్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ అవగాహన కోసమే శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య

లేపాక్షి: సీపీఐ నాయకులు, కార్యకర్తల్లో రాజకీయ అవగాహన పెంపొందించేందుకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.రామయంద్రయ్య తెలిపారు. శనివారం ఉదయం లేపాక్షిలోని ఆర్‌జేహెచ్ ఫంక్షన్ హాల్‌లో సీపీఐ రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. తొలుత సీపీఐ జెండాను సీనియర్ నాయకుడు నారాయణ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో రామచంద్రయ్య మాట్లాడుతూ.. రాజకీయ అవగాహన లేనప్పుడు పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనలేమన్నారు. ప్రజలకు కూడా సరైన సమాచారం ఇవ్వలేక పోతామన్నారు. ప్రజా నాట్యమండలి కళాకారులు లెనిన్, కుళ్లాయప్ప, ఆంజనేయులు, ప్రసాద్, పుల్లయ్య విప్లవ గీతాలను ఆలపించి సభికులను ఉత్తేజ పరిచారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, సీపీఐ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు కాటమయ్య, మహిళా సంఘం నాయకురాళ్లు పద్మావతి, సంపూర్ణమ్మ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు గోవిందరెడ్డి, మధు, ఆంజనేయులు, రాజేంద్ర, జయలక్ష్మి, పట్టణ కార్యదర్శి వినోద్‌కుమార్, మండల కార్యదర్శులు శివప్ప, స్థానిక నాయకులు గౌతంకుమార్, గోవిందప్ప, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉష్ణోగ్రత సమాచారం

(గరిష్టం)

హిందూపురం : 36.0
పెనుకొండ : 40.0
మడకశిర : 36.0

విద్యార్థులందరికీ జగనన్న విద్యాకానుక కిట్లు

గుడిబండ: జూన్ 12న పాఠశాలలు ప్రారంభం రోజునే విద్యార్థులందరికీ జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తామని ఎంఈఓ శ్రీధర్ సూచించారు. శనివారం ఆయన మండలానికి చేరుకున్న పుస్తకాలు, యూనిఫాం తదితర జగనన్న విద్యా కానుక కిట్లను పరిశీలించారు. అలాగే సీఆర్‌పీల ద్వారా పాఠశాలల వారిగా జగనన్న విద్యా కానుక కిట్లను వేరుచేయించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల ప్రారంభం రోజునే విద్యార్థులందరికీ జగనన్న విద్యా కానుక ద్వారా పుస్తకాలు, నోట్‌బుక్‌లు, యూనిఫాం, షూ, సాక్స్, బ్యాగ్‌లు అందజేస్తామన్నారు.

అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కోరిన ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వివిధ కమిటీల జాబితాను అందజేసిన ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

హిందూపురం: వైఎస్సార్‌సీపీ బలపేతంతో పాటు రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా సమర్థవంతంగా పని చేయడానికి పార్టీ కోసం పని చేసిన నాయకులతో వివిధ కమిటీలను ఎంపిక చేశామని హిందూపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ తెలిపారు. శనివారం అనంతపురం సమీపంలోని సోమలదొడ్డి రిసర్ట్ వద్ద హిందూపురం పార్టీ నాయకులతో కలిసి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హిందూపురం నియోజకవర్గానికి సంబంధించి వైఎస్సార్‌సీపీ అనుబంధ వివిధ కమిటీలకు ఎంపిక చేసిన జాబితాను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అందజేశారు. అలాగే వివిధ పనులకు సంబంధించి బిల్లులను త్వరితగతిన మంజూరు చేయించేలా కృషి చేయాలని కోరారు. రైల్వే రోడ్డుతో పాటు వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేయడానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జబివుల్లా, ఖలీల్, సోమశేఖర్‌రెడ్డి, ఇలియాజ్, కట్ల బాషా, మన్సూర్, చాందు, రాము, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీలను కలసిన ఎమ్మెల్సీ, ఆగ్రోస్ చైర్మన్



అనంతపురం జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుకు మొక్క అందజేస్తున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్



సత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్

హిందూపురం: పుట్టపర్తిలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ ఎస్వీ మాధవరావును శనివారం ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వివిధ అంశాలపై చర్చించారు.

హిందూపురం: అనంతపురం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ శ్రీనివాసరావును శనివారం ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. గతంలో రాయలసీమ ఐజీగా పని చేసినప్పటి పరిస్థితులను ఎమ్మెల్సీ ఇక్బాల్ గుర్తు చేశారు. సమకాలీకుల అధికారులను గుర్తుకు తెచ్చుకుంటూ వివిధ అంశాలను నెమరువేసుకున్నారు. జిల్లాలోని శాంతిభద్రతలపై చర్చించుకున్నారు.

కొడవలితో బెదిరించి ఆటో ఎత్తుకెళ్లిన దొంగ



మాట్లాడుతున్న హిందూపురం రూరల్ సీఐ వేణుగోపాల్, ఎస్ఐలు

లేపాక్షి: ఓ గుర్తు తెలియని వ్యక్తి హిందూపురం పట్టణంలో ఓ ఆటో డ్రైవర్ కళ్లలోకి కారం పొడి చల్లి, కొడవలితో బెదిరించి, ఆటో ఎత్తుకెళ్లిన సంఘటన శుక్రవారం మధ్యాహ్నం లేపాక్షి మండలం పులమతి పంచాయితీ పరిధిలోని లయోలా పాఠశాల సమీపంలో చోటుచేసుకుంది. శనివారం సాయంత్రం లేపాక్షి పోలీస్ స్టేషన్‌లో హిందూపురం రూరల్ సీఐ వేణుగోపాల్ వివరాలు వెల్లడించారు. శుక్రవారం మధ్యాహ్నం హిందూపురం పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో ఉన్న రహమత్‌పురానికి చెందిన ఫక్రుద్దీన్ అనే ఆటో డ్రైవర్ వద్దకు గుర్తు తెలియని వ్యక్తి వెళ్లి హిందూపురం రూరల్ మండలంలోని కొటిపికి వెళ్లడానికి ఆటోను బాడుగకు మాట్లాడుకున్నాడు. లయోలా పాఠశాల సమీపంలోకి వెళ్లగానే సదరు వ్యక్తి డ్రైవర్ కళ్లలోకి కారం పొడి చల్లి ఆటోను తీసుకెళ్లాడు. ఆటోడ్రైవర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ మునీర్ అహమ్మద్ కేసు నమోదు చేసుకుని 24 గంటల్లో ఆటోతో పాటు ముద్దాయిని పట్టుకున్నారు. ముద్దాయి లేపాక్షి మండలం మానేపల్లికి చెందిన పిటి.ప్రసాద్ (20)గా గుర్తించారు. అయితే ముద్దాయి తన పొదుపు సంఘం డబ్బులు రూ.2 లక్షలను వ్యసనాలకు ఖర్చు చేసినట్లు నేరం అంగీకరించాడు. ఆటో నం.ఏపీ39 టీఎక్స్ 3044ను, కొడవలి, కారం పొడి ప్యాకెట్లు సీజ్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి మంత్రి హామీ

మడకశిర: రాష్ట్ర వ్యాప్తంగా వైద్య ఆరోగ్యశాఖలో సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హామీ ఇచ్చినట్లు ఏపీ మెడికల్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు బత్తుల కోదండరామిరెడ్డి తెలిపారు. ఆయన మడకశిరలో విలేకరులతో మాట్లాడుతూ అనంతపురంలో శనివారం మంత్రిని కలిసి తమ సమస్యలపై వినతి పత్రాన్ని సమర్పించామన్నారు. పెనుకొండ మెడికల్ కళాశాలను వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించాలని కోరామన్నారు. కాంట్రాక్ట్ వైద్య సిబ్బందిని రెగ్యులర్ చేయాలని, అనంతపురం మెడికల్ కళాశాలలో స్టాఫ్‌నర్సుల కొరత నివారించాలని, పీజీ సీట్లు పెంచాలని కోరినట్లుని తెలిపారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారన్నారు. అలాగే వెంటనే సంబంధిత మంత్రి విడుదల రజినితో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు పరిష్కరించడానికి చొరవ తీసుకున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఏపీ మెడికల్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు మంత్రిని ఘనంగా సన్మానించామన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం



హిందూపురం: లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరిస్తున్న ఏడీజే శైలజ



పెనుకొండ: మాట్లాడుతున్న న్యాయమూర్తి ముజీబ్ పసపల సయ్యద్



మడకశిర: లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జడ్జి ఆర్.అశోక్‌కుమార్

హిందూపురం: రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకోవాలని హిందూపురం అదనపు జిల్లా జడ్జి శైలజ అన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో మెగా లోక్ అదాలత్ జరిగింది. సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్, న్యాయమూర్తులు ఆనందతీర్థ, సుకుమార్ నేతృత్వంలో రెండు బెంచులను ఏర్పాటు చేసి కేసులను పరిష్కరించారు. మొత్తం 290 కేసులు పరిష్కారయ్యాయి. ఈ సందర్భంగా ఏడీజే మాట్లాడుతూ.. కక్షిదారులు కేసులతో కోర్టులు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగి సమయాన్ని వృథా చేసుకోవద్దన్నారు. 8 సివిల్, 3 ప్రమాద కేసులు, ఎక్సైజ్ గుట్కా కేసులు ఒక్కొకటి 15 ఇసుక అక్రమ రవాణా కేసులు, 32 ఐపీసీ, 28 బ్యాంకు కేసులు 2 బీఎస్ఎన్ఎల్ కేసులు మొత్తం 290 కేసులను పరిష్కరించారు. కక్షిదారులకు రూ.19,23, 400 అందజేసేలా తీర్పునిచ్చారు. లోక్ అదాలత్‌కు హాజరైన వారికి యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో డీఎస్పీ కంజాక్షన్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు, ఏపీపీలు ఇందాద్ ,నగేష్ , లోక్ అదాలత్ సభ్యులు నవేరా, పార్వతి, రత్నమ్మ, జ్ఞానేష్, శారద, హేమావతి తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 166 కేసులు పరిష్కారమయ్యాయి. మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి శంకరరావు, న్యాయమూర్తి ముజీబ్ పసపల సయ్యద్ ఆధ్వర్యంలో కేసులు పరిష్కరించారు. ఏజీపీ భాస్కరరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు, న్యాయవాదులు పాల్గొన్నారు. న్యాయమూర్తి శంకరరావు మాట్లాడుతూ కక్షిదారులు రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ చక్కటి వేదిక అని అన్నారు. అనంతరం న్యాయమూర్తి ముజీబ్ పసపల సయ్యద్ మాట్లాడారు. న్యాయవాదులు అశ్వర్థ నారాయణ, మోహన్‌నాయక్, రాజేష్‌నాయక్, అశ్వర్థ, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

మడకశిరరూరల్: స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో జూనియర్ సివిల్ జడ్జి ఆర్. అశోక్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ మార్గాన 129 కేసులను పరిష్కారించారు. జడ్జి మాట్లాడుతూ కక్షిదారులు కోర్టుల చుట్టూ సంవత్సరాల తరబడి తిరగకుండా సత్వరమే న్యాయం అందించడానికి జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకోవడానికి రాజీమార్గమే రాజమార్గమన్నారు. లోక్‌అదాలత్‌తో పరిష్కరించిన కేసులకు అప్పీల్ ఉండదన్నారు. అనంతరం లోక్ అదాలత్‌లో నాలుగు బ్యాంకు కేసులు పరిష్కరించి రూ.3.66,000 బ్యాంకుకు లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు.125 క్రిమినల్ కేసులను పరిష్కరించి రూ 1,51,100 జరిమానా విధించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, సీఐలు, ఎస్ఐలు, పోలీసులు, కక్షిదారులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

హిందూపురం/లేపాక్షి: కర్ణాటకలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో పట్టణంలో ఆ పార్టీ నాయకులు శనివారం పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. బాలాజీ మనోహర్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పురవీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచి పెట్టారు. ఆటో నగర్‌లో శ్యాంకిరణ్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. అలాగే లేపాక్షిలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు.

పెనుకొండ/పరిగి/సోమందేపల్లి/గోరంట్ల: కాంగ్రెస్ పార్టీ పెనుకొండ ఇన్‌చార్జి నరసింహులు ఆధ్వర్యంలో శనివారం పెనుకొండ పట్టణంలోని దర్గా సర్కిల్‌లో కార్యకర్తలు బాణా సంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. నిషార్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పరిగి, సోమందేపల్లి,గోరంట్లలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. పరిగిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళుర్పించారు. భాస్కర్‌రెడ్డి, బీసీ సెల్ మూర్తి, రామాంజినరెడ్డి తదితరులు పాల్గొన్నారు. గోరంట్లలో పార్టీ పెనుకొండ ఇన్‌చార్జి పాలసముద్రం నరసింహులు ఆధ్వర్యంలో బస్టాండ్ సర్కిల్‌లో కాంగ్రెస్ నాయకులు బాణ సంచా పేల్చి సంబరాలు నిర్వహించారు.

మడకశిర/అమరాపురం/రొళ్ల: కర్ణాటక రాష్ట్రంలో జరిగిన సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయదుందుభి మోగించడంతో మడకశిరలో ఆ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. రాజీవ్‌గాంధీ సర్కిల్‌లో బాణా సంచా పేల్చి, కేక్ కట్ చేశారు. మాజీ ఎమ్మెల్యే సుధాకర్ పాల్గొన్నారు. అలాగే అమరాపురంలో నిర్వహించిన సంబరాల్లో పార్టీ మండల అధ్యక్షుడు గురుమూర్తి, నాయకులు సిద్దేశ్వర, శివకుమార్, విశ్వనాథ్, శ్రీనివాస్, కేశవమూర్తి, రంగనాథ, తిప్పేస్వామి తదితరులు ఉన్నారు. రొళ్లలో కాంగ్రెస్ నాయకులు టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు.

పావగడ కోటపై 'కాంగ్రెస్' పాగా



రాజవంతి సరిహద్దులో ఎమ్మెల్యే వెంకటేశ్‌కు స్వాగతం పలుకుతున్న అభిమానులు

పావగడ: స్థానిక ఎస్సీ రిజర్వ్ విధానసభ క్షేత్రం ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి హెచ్.వి.వెంకటేశ్ తన సమీప ప్రత్యర్థి జేడీఎస్ అభ్యర్థి కేఎం తిమ్మరాయప్పపై 10,881 మెజారిటీతో విజయభేరి మోగించారు. విజేత వెంకటేశ్‌కు 83,062 ఓట్లు పోలు కాగా పరాజిత తిమ్మరాయప్పకు 72,181 ఓట్లు పడ్డాయి. మొత్తం 1,93,007 ఓట్లలో1,67,390 ఓట్లు పోలయ్యాయి. తుమకూరు పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం ఓట్ల లెక్కింపు నిర్వహించారు. మొదటి రౌండ్ నుంచి చివరి రౌండ్ దాకా వెంకటేశ్ వేల మెజారిటీతో దూసుకుపోయి రికార్డు స్థాయిలో గెలుపొందారు. బీజేపీ అభ్యర్థి కృష్ణానాయక్‌కు 7,098 ఓట్లు పడగా మిగతా అభ్యర్థులు నామ మాత్రపు ఓట్లు సాధించారు. వెంకటేశ్ గెలుపుతో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సంబరాలు చేసుకున్నారు. శని మహాత్మ సర్కిల్ వద్ద బాణ సంచా పేల్చి సందడి చేశారు. తాలూకా వ్యాప్తంగా అన్ని చోట్ల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పండుగ చేసుకున్నారు.

'వెంకటేశ్'కు జన నీరాజనం

పావగడ నూతన ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్‌కు పట్టణ ప్రజలు శనివారం సాయంత్రం ఘన స్వాగతం పలికారు. రాజవంతి సరిహద్దులో వందలాది మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆయనకు నీరాజనాలు అందించారు. రాజవంతి గ్రామం లోని ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి మార్గ మధ్యంలో అభిమానులను పలకరిస్తూ సాయంత్రం పావగడలోని శని మహాత్మ సర్కిల్ కు చేరుకున్నారు. అప్పటికే పోగైన వేలాది మంది ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. అనంతరం తన స్వగ్రామం హనుమంతనహళ్లి వెళ్లారు. తన తండ్రి, మాజీ ఎమ్మెల్యే వెంకటరమణప్ప ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నాయకులు శంకరరెడ్డి, రాజేశ్, లాయర్లు భగవంతప్ప, వెంకట్రామిరెడ్డి, నాగార్జునరెడి, నరసింహారెడ్డి, మానం వెంకటస్వామి, మాజీ మున్సిపల్ చైర్మన్ వేలు తదితరులు ఆయనను అభినందించారు.

రైతు సంక్షేమానికి ప్రాధాన్యం

మడకశిరరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. శనివారం ఆర్.అనంతపురం రైతు భరోసా కేంద్రాన్ని చేరిన సబ్సిడీ విత్తన వేరుశనగ నాణ్యతను ఏఓ వీరనరేష్‌తో కలసి వారు పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన రైతులందరికీ 40 శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగను గ్రామ స్థాయిలోనే పంపిణీ చేస్తుందన్నారు. వచ్చే వారం నుంచి ఆర్బీకేల్లో రైతుల నుంచి రిజిస్ట్రేషన్ చేసుకుంటామన్నారు. మండలానికి కే -6 రకం 3,500 క్వింటాళ్లు కేటాయించారన్నారు. రూ.1,116 సబ్సిడీ పోను రైతు ఒక బస్తాకు రూ.1,674 చెల్లించాలన్నారు. అనంతరం ఆయన ఆర్బీకేను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శివగంగప్ప, నర్సేగౌడు, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

అమరాపురం: మండలంలోని హలుకూరు గ్రామ సమీపంలో ఉన్న మోడల్ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఓబళపతి సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 25వ తేది లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 బీసీ, ఓసీ విద్యార్థులు రూ.150 ఫీజు చెల్లించాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు జూన్ 11 ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ అర్హత పరీక్ష నిర్వహిస్తామన్నారు.

భవనాన్ని మరమ్మతు చేయాలని వినతి

రొళ్ల: మండల కేంద్రం రత్నగిరి ప్రధాన రహదారి పక్కన అంబేడ్కర్ కమ్యూనిటీ భవనాన్ని మరమ్మతు చేయాలని దళిత సంఘం నాయకులు, యువకులు శనివారం సాయంత్రం ఆర్డీటీ సభ్యులను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. కమ్యూనిటీ భవనం శిథిలావస్థకు చేరి పైకప్పు పెచ్చులూడుతోందన్నారు. వర్షం వస్తే పూర్తిగా కారుతుందన్నారు. ఆర్డీటీ వారు స్పందించి శిథిలావస్థకు చేరిన కమ్యూనిటీ భవనాన్ని మరమ్మతు చేసి ఉపయోగానికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

26,750 క్వింటాళ్ల విత్తన వేరుశనగకు ప్రతిపాదన

మడకశిరరూరల్/రొళ్ల: మడకశిర వ్యవసాయశాఖ డివిజన్ పరిధిలో ఐదు మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి 26,750 క్వింటాళ్ల వేరుశనగ, 340 క్వింటాళ్ల కందులు, 210 క్వింటాళ్ల రాగి విత్తనాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని ఏడీఏ కృష్ణమీనన్ శనివారం తెలిపారు. మడకశిర మండలానికి 7,000 క్వింటాళ్ల వేరుశనగ , 100 క్వింటాళ్ల కందులు, 40 క్వింటాళ్ల రాగులు, అగళి మండలానికి 3,750 క్వింటాళ్ల వేరుశనగ, 30 క్వింటాళ్ల కందులు, 20 క్వింటాళ్ల రాగులు అమసరమైనట్లు గుర్తించామన్నారు. అలాగే అమరాపురం మండలానికి 7,000 క్వింటాళ్ల వేరుశనగ , 100 క్వింటాళ్ల కందులు, 50 క్వింటాళ్లు రాగులు, గుడిబండ మండలానికి 6,000 క్వింటాళ్ల వేరుశనగ, 60 క్వింటాళ్ల కందులు, 50 క్వింటాళ్ల రాగులు, రొళ్ల మండలానికి 3,000 క్వింటాళ్ల వేరుశనగ, 50 క్వింటాళ్ల కందులు, 50 క్వింటాళ్ల రాగులకు ప్రతి పాదనలు పంపించామన్నారు. ఇప్పటికే ఆర్బీకేలకు విత్తన వేరుశనగ చేరుతోందన్నారు.

750 మందికి కంటి పరీక్షలు

హిందూపురం: స్థానిక ఆల్‌హిలాల్ పాఠశాలలో శనివారం ట్రినిటీ సర్వీసెస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ కుమార్ రాజా, కార్యదర్శి ఉషారాణి, బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి బృందం సంయుక్తంగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 750 మంది వైద్య శిబిరానికి హాజరుకాగా.. బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి డాక్టర్ స్వప్న 215 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఎంపికైన వారిని బెంగళూరు శంకర కంటి ఆసుపత్రికి తీసుకెళ్లి ఆపరేషన్లు చేయించి, తిరిగి హిందూపురానికి తీసుకురావడం జరుగుతుందన్నారు. అలాగే గత నెలలో ఆపరేషన్ పూర్తి చేసుకున్న 275 మందికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్యాంప్ ఇన్‌చార్జ్ శివప్రకాష్, ట్రినిటీ సర్వీసెస్ ఆర్గనైజేషన్ సభ్యులు, జామియా మసీదు కమిటీ ముతవల్లి నూరుల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాలీల చోరీ

సోమందేపల్లి : మండలంలోని రంగేపల్లి గ్రామ సమీపంలో సిమెంటు ఇటుకల పరిశ్రమలో చోరీ జరిగింది. శుక్రవారం రాత్రి దుండగలు చొరబడి 70 ట్రాలీలు చోరీ చేసినట్లు యజమాని నరసింహమూర్తి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఎస్ఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు గాలింపు చేపట్టి ట్రాలీలను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. దొంగల కోసం గాలిస్తున్నట్లు తెలిసింది.

'సమయపాలన పాటించకపోతే చర్యలు'

గుడిబండ: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని ఎంపీడీఓ రామారావు హెచ్చరించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని సచివాలయ సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గురువారం జరిగిన మండల సాధారణ సర్వసభ్య సమావేశంలో సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడం లేదని పలువురు సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకొచ్చారన్నారు. ప్రతి సచివాలయ ఉద్యోగీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సచివాలయాల్లో ఉండాలన్నారు. ఎవరైనా బయటికి వెళ్లాల్సి వస్తే డీడీఓ అనుమతి తీసుకోవాలని ఆయన సూచించారు.